క్లుప్తంగా

ఎన్‌పీసీఐతో అనుసంధానం చేసుకోవాలి

• పోస్టల్ ఐపీవో సత్యనారాయణ



మాట్లాడుతున్న ఐపీవో సత్యనారాయణ

నెల్లిమర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే లబ్ధి నేరుగా సంబంధిత లబ్ధిదారుల ఖాతాలో జమ కావాలంటే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)తో పోస్టల్ ఖాతాలను అనుసంధానం చేసుకోవాలని విజయనగరం వెస్ట్ సబ్ డివిజన్ ఐపీవో కె.సత్యనారాయణ అన్నారు. బుధవారం నెల్లిమర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దీని కోసం వార్డు సచివాలయాల్లో పోస్టల్ సిబ్బంది శిబిరాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. వాటిని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖాతాలు లేనివారికి పోస్టాఫీసుల్లో ఖాతాను తెరచుకునే సదుపాయం ఉందన్నారు. కేవలం రూ.200లకే ఖాతా తెరిచే అవకాశం ఉందన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 10వ తేదీలోగా ఖాతాలను తెరుచుకోవాలన్నారు.

మహిళలకు రక్షణగా శక్తి యాప్

విజయనగరం క్రైమ్ : మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్‌ను ప్రతి మహిళ, యువత తన మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని తప్పనిసరిగా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం పిలుపునిచ్చారు. మహిళల మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఒక కుటుంబ సభ్యుడు మీకు తోడు ఉన్నట్టేనని పేర్కొన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్‌లోని ఎస్.ఓ.ఎస్ బటన్‌ను ప్రెస్ చేస్తే క్షణాల్లో పోలీసు బృందం ఆపదలో ఉన్న వారి చెంతకు చేరుతుందని పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే పోలీసు బృందాలు మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.

ధూపదీప నైవేద్యాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: జిల్లాలోని రూ.ఐదు లక్షల ఆదాయం లోపు ఉన్న ఆలయాలకు చెందిన అర్చకులకు ధూపదీప నైవేద్యాలకు ఇచ్చే మొత్తానికిగానూ దరఖాస్తులు దేవదాయశాఖ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని, అదే విధంగా సీసీ కెమెరాల ఎక్కడైనా అవసరమైతే ఆయా దేవాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేయడానికి దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, అర్చకులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర ప్రచార కార్యదర్శి గన్నవరపు శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పట్టణ, మారుమూల గ్రామీణ ప్రాంతాల దేవాలయాల్లో గతంలో జరిగిన దాడులు, చోరీల కారణంగా దేవాలయ వ్యవస్థను పటిష్ట పరిచేందుకు రాష్ట్ర దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిఘా కెమెరాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని అన్ని దేవాలయ కమిటీలు, అర్చకులు అందుబాటులో ఉన్న దేవదాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుణ్య తిరుమలగిరిపై ప్రత్యేక పూజలు

శృంగవరపుకోట: పుణ్య తిరుమలగిరిపై వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవానికి సంబంధించి బుధవారం అంకురార్పణ జరిగింది. ఉదయం నుంచి రుత్విక్కుల వేద మంత్రోచ్చారణలతో పుణ్యతిరుమల వేదఘోషతో రంజిల్లింది. ఉదయం ప్రబంధ సేవాకాలంతో స్వామికి భాలభోగం నివేదించిన తర్వాత శాంతిపాఠం, అరణిమధనం చేసి అగ్నిప్రతిష్టతో యాగశాల ప్రవేశం చేయించారు. మూలమంత్ర, మూర్తి మంత్ర హవనాలు చేశారు. తర్వాత దేవతామూర్తుల విగ్రహాలకు పంచగవ్యాధివాసం నిర్వహించారు. సాయంత్రం ధాన్యాధివాసం నిర్వహించి దేవతామూర్తుల విగ్రహాలను ధాన్యంలో ఉంచారు. రఘురాజు దంపతులు దేవతామూర్తులకు క్షీరాధి పంచగవ్యాధివాసాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పట్టణానికి చెందిన పలువురు భక్తులు, పెద్దలు, పలువురు శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

గాన గంధర్వుడికి నివాళులు..



ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, వాకాడ గోపి, తదితరులు

గుర్ల (గరివిడి): గాన గాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా గరివిడి పట్టణంలోని ఉన్న ఆయన విగ్రహనికి జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, ఎస్ఎంఎస్ ఫెర్రో యూనిట్ హెడ్ వాకాడ గోపి పూలమాలలు వేసి బుధవారం నివాళులర్పించారు. తన గొంతుతో ఎన్నో మధుర గీతాలు పాడి అందరు హృదయాల్లో ఉత్తమ గాయకుడిగా నిలిచిన వ్యక్తి బాలసుబ్రహ్మణ్యమని కొనియాడారు. కార్యక్రమంలో గరివిడి పట్టణ ఎంపీటీసీ సభ్యుడు వలిరెడ్డి లక్ష్మణ, ఉప సర్పంచ్ బమ్మిడి కార్తీక్, సహాయ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీను ఉన్నారు.

బాబు వెన్నుపోటుపై ప్రజాగ్రహం

- చంద్రబాబుకు వెన్నుపోటు పొడవటం కొత్తకాదు
- నాడు మామ ఎన్టీఆర్‌కు.. నేడు నమ్మి ఓట్లేసిన ప్రజలకు
- హామీలు అమలు చేయకుంటే 2019 నాటి ఫలితాలు పునరావృతం
- ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- వెన్నుపోటు దినంకు పోటెత్తిన ప్రజలు
- సీఎంఆర్ జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ



వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా నగరంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

విజయనగరం: చంద్రబాబుకు వెన్నుపోటు పొడవటం కొత్త కాదని, దివంగత ఎన్టీఆర్ కష్టపడి ప్రజాభిమానంతో ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుంటే వెన్నుపోటు పొడిచి ఆ పీఠాన్ని దక్కించుకున్న చంద్రబాబుకు హామీల అమల్లో ప్రజలకు వెన్ను పోటు పొడిస్తే 2019 ఎన్నికల నాటి ఫలితాలు మరోసారి పునరావృతం అవుతాయని శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన సందర్భంలో ఆయన కుటుంబ సభ్యులుగానీ, అభిమానులు ధ్వజమెత్తకపోయినా... వారికి జరుగుతున్న అన్యాయంపై ప్రజలు మాత్రం విడిచిపెట్టరన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయటాన్ని నిరసిస్తూ బుధవారం తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమం విజయనగరం నియోజకవర్గంలో విజయవంతంగా జరిగింది. స్థానిక సీఎంఆర్ జంక్షన్ నుంచి ఎన్‌సీఎస్ థియేటర్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు పార్టీ శ్రేణులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంచార్జ్ తహసీల్దార్ స్వర్ణకుమార్‌కు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ర్యాలీలో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో పాటు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. నాడు సొంత మామకే వెన్నుపోటు...నేడు పేద ప్రజలకు వెన్నుపోటు... ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలి.... బేవరేజస్ ఉద్యోగులను తక్షణమే ఆదుకోవాలంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ ఏడాది క్రితం కూటమి పేరిట టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కలిసికట్టుగా కూటమి పేరిట పోటీ చేసి అధికారంలోకి వచ్చాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా స్థానిక తహసీల్దార్‌లకు ఎన్నికల హామీలు అమలు చేయాలని గుర్తు చేస్తూ వినతిపత్రాలు అందజేసినట్టు చెప్పారు.



ఇంచార్జ్ తహసీల్దార్ స్వర్ణకుమార్‌కు వినతిపత్రం అందజేత

అధికారంలో ఉన్నా.. లేకున్నా.. ప్రజాపక్షమే

అధికారంలో ఉన్నా లేకపోయినా వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన నిలబడుతుందని కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. 2019 నుంచి 2024 వరకు ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేయడంతో పాటు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రకటించిన నవరత్నాల రూపంలో పథకాలను ప్రజలకు అందజేయటం జరిగిందన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలకు ఆశపడి ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టంకడితే అధికారంలో లేకపోయినా ప్రభుత్వం చేసిన తప్పిదాలను వేలెత్తి చూపిస్తూ ప్రజల పక్షాన నిలబడటం జరిగిందన్నారు. ఎన్నికలకు ముందు వలంటీర్‌లకు రూ.10వేలు ఇస్తామని చెప్పి నమ్మించి మేసం చేశారన్నారు. ఇంటింటికి రేషన్ పంపిణీ చేసిన వాహనాలను రద్దు చేశారని, నిరుద్యోగ భృతి ఇవ్వలేదన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తామని, మహిళలకు రూ.1500 ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. తల్లికి వందనం ఇస్తామని పంగనామం పెట్టి...నాన్నకు ఇంధనం మాత్రం అందుబాటులో ఉంచారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గడిచిన ఏడాది బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జెడ్పీటీసీ కెల్ల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బొద్దాన అప్పారావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గదుల సత్యలత, విజయనగరం నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు, మండల పార్టీ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, పలు డివిజన్‌లకు చెందిన కార్పొరేటర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సర్కారు వెన్నుపోటుపై తిరుగుబాటు



పూసపాటిరేగలో వెన్నుపోటు దినం ర్యాలీలో ప్రజలతో మమేకమైన నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- వెన్నుపోటు దినంకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- కూటమి పాలనను నిరసించిన జనం
- మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు నేతృత్వంలో భారీ ర్యాలీ

పూసపాటిరేగ : కూటమి సర్కారు ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల తిరుగుబాటు మొదలైంది. వేలాదిగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు వెన్నుపోటు దినం కార్యక్రమానికి బుధవారం తరలివచ్చారు. ఉదయం 10 గంటల సమయంలో పోస్టాఫీసు నుంచి ప్రారంభమైన ర్యాలీ బరోడా బ్యాంకు, జాతీయ రహదారి, రాజావీధి, ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు సుమారు 2 కిలోమీటర్లు మేర సాగింది. దారి పొడువునా కూటమి సర్కారుకు వ్యతిరేకంగా ప్రజలు నినాదాలు చేశారు. సూపర్ సిక్స్ పేరిట ప్రజలను మోసం చేసిన సర్కారుపై ప్రజలు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా నెల్లిమర్ల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికలలో అధికారం కోసం అబద్దపు హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. సూపర్ సిక్స్ అమలు గాలికి వదిలేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఎన్నికల ముందు వాలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాన్ని ఊడదీశారన్నారు. ఐదేళ్ల పాటు ఇంటింటికి వెళ్లి వాహనాలలో సరుకులు అందజేస్తే నేడు మళ్లీ డీలర్ల వ్యవస్థను తీసుకువచ్చి లబ్ధిదారులను రేషను దుకాణాలు చుట్టూ తిప్పే ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు. రైతులకు రైతు భరోసా లేదు, విత్తనాలు ఎరువులు ఇవ్వక ప్రైవేటు డీలర్లును ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు సామాజిక వర్గాన్ని అభివృద్ధి చేయడానికే అమరావతిని రాజధానిగా ఎంపిక చేశారన్నారు. విద్యా వ్యవస్థ పూర్తిగా గాడితప్పి పదో తరగతి విద్యార్థులు 70 వేల మంది రీవాల్యుయేషన్‌కు పెట్టుకున్న పరిస్థితి దాపురించిందన్నారు. అభివృద్ధిలో వెనుకబడిన ఉత్తరాంధ్రలో విశాఖకు రాజధాని రాకుండా అడ్డుకున్నారన్నారు. ఏ ఒక్క పథకం అమలు కాకపోవడంతో ప్రజలు సంక్షేమానికి దూరం అయ్యారన్నారు. ప్రజావ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కూటమి సర్కారుపై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. అనంతరం పూసపాటిరేగ తహసీల్దార్ తాడ్డి గోవింద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పిన్నింటి తమ్మునాయుడు, గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, పూసపాటిరేగ, నెల్లిమర్ల ఎంపీపీలు మహంతి కల్యాణి, అంబళ్ల సుధారాణి, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, అల్లాడ సత్యనారాయణమూర్తి, ఎస్. సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు అంబళ్ల శ్రీరాములునాయుడు, మత్స సత్యనారాయణ, మహంతి జనార్దనరావు, మహంతి శ్రీనివాసరావు, రేగాని శ్రీనివాసరావు, పడాల భానుప్రకాశరావు, మహంతి లక్ష్మణరావు, లెంక లక్ష్మణరావు, మొంగం నాగబాబు, సారిక గౌరి, ఎడ్ల రామకృష్ణ, గుజ్జు సురేస్ రెడ్డి, దాడిశెట్టి త్రినాధరావు, టొంపల సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కృషి చేయాలి

- జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: ప్రకృతి వ్యవసాయ విస్తరణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు అన్నారు. స్థానిక రైతు శిక్షణ కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్లకు ప్రకృతి వ్యవసాయంపై సంపూర్ణ అవగాహన కల్పించడానికి ఈ శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటల ద్వారా ఆరోగ్యకర పంటలు వస్తాయన్నారు. ఇవి తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయ విభాగం మేనేజర్ ఆనందరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి జమదగ్ని, కె.ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

విజయనగరం ఫోర్ట్: తోటపాలేం సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం కలగనున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ పి.త్రినాధరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. బ్యాంక్ కాలనీ, శ్రీరామ్‌నగర్, గోపాల్‌నగర్, ఇందిరానగర్, నాగోజీపేట, రైల్వేస్టేషన్ రోడ్డు, బొత్సపేట, సెంట్రల్ బ్యాంకు ఏరియా, తిరుమల ఆసుపత్రి ఏరియా, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, బాలాజీ నగర్, సాయినగర్, సిద్ధార్థ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవంపై సమీక్ష

వేపాడ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో యోగాంధ్ర, ప్రపంచ పర్యావరణ దినోత్సవంపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి సచివాలయం పరిధిలో 70 మందికి టీఓటీ యోగాసనాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 7 నుంచి 14 వరకు గ్రామాల్లో యోగాంధ్రపై ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించాలన్నారు. అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాములమ్మ, ఎంఈఓ బాలభాస్కరరావు, ఈసీ జోగారావు, మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం : కమిషనర్



అధికారులతో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్

విజయనగరం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, హరితాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా వనం మనం కార్యక్రమంలో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. కార్యక్రమానికి సంబంధించి బుధవారం ఆయన అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గురువారం ఉదయం 7.15 నిమిషాలకు పూల్‌బాగ్ కాలనీలో ఉన్న నగర పాలక సంస్థ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టనున్నట్టు తెలిపారు. మొత్తం 12 వేల మొక్కలను నగరంలో నాటేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే మూడు వేల గోతులను తవ్వించి మొక్కలు నాటేందుకు సిద్ధం చేశామని చెప్పారు. అలాగే కాలువలను పరిశుభ్రపరిచేందుకు పెద్ద ఎత్తున పారిశుధ్య కార్యక్రమాలకు నిర్దేశించినట్టు తెలిపారు. వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రాంతాలు, మతపరమైన ప్రదేశాలలో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 7:45 నిమిషాలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, నగరపాలక సంస్థ సంయుక్త నేతృత్వంలో మయూరి జంక్షన్ నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో కార్యశాలను నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, డీఈ ప్రసాద్ పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం'కు తరలిన ప్రజలు



వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గదల ఆధ్వర్యంలో తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నెల్లిమర్ల రూరల్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు వెన్నుపోటు దినం ర్యాలీకి బుధవారం తరలివెళ్లారు. పూసపాటిరేగలో నిర్వహించిన కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు, పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా వెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు గదల సన్యాసినాయుడు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠంనాయుడు, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పెద్ద సంఖ్యలో అభిమానులు వెళ్లారు.

రహదారికి అడ్డంగా కూలిన భారీ వృక్షం



రామతీర్థం సమీపంలో రహదారికి అడ్డంగా కూలిన భారీ వృక్షం

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల - రణస్థలం ప్రధాన రహదారిలోని స్థానిక రామతీర్థం సమీపంలో భారీ వృక్షం నేలకొరిగింది. బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఆ మార్గంలో రాకపోకలు బంద్ కావడంతో సీతారామునిపేట జంక్షన్ నుంచి దన్నానపేట రోడ్డు మీదుగా వాహనదారులు తమ రాకపోకలు సాగించారు. స్థానికులు భారీ వృక్షాన్ని యంత్రాల సహాయంతో పక్కకు తీసే పనిలో నిమగ్నమయ్యారు.

ఉదయం ఉక్కపోత... సాయంత్రం భారీ వర్షం



వర్షపు నీటిలో చిక్కుకున్న ద్విచక్ర వాహనాలు



రాజీవ్ క్రీడా ప్రాంగణం రోడ్డులో వర్షపు నీరు



పాతబస్టాండ్ రోడ్డులో వర్షపు నీరు





వర్షపు నీటిలో వాహనదారుల పాట్లు

విజయనగరం: భారీ ఈదురుగాలులు.. భయపెట్టే పిడుగుల శబ్దాలు..... ఉరుములు మెరుపులతో బుధవారం సాయంత్రం విజయనగరం జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురిసింది. గత రెండు రోజులుగా తీవ్రమైన ఎండవేడిమితో ఉక్కిడిబిక్కిరి అవుతున్న ప్రజలకు భారీ వర్షంతో ఉపశమనం లభించినట్లైంది. సాయంత్రం 5.15 గంటలకు ప్రారంభమైన వర్షం ఏకధాటిగా కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్, సిటీ బస్టాండ్ రోడ్‌లో భారీఎత్తున వరదనీరు చేరడంతో అటుగా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధర్మపురి రోడ్, దాసన్నపేట రోడ్, రైల్వే ఓవర్ బ్రిడ్జి తదితర ప్రాంతాలు నీటి మునిగిపోవడంతో జనజీవనం స్తంభించింది. వివిధ అవసరాలు నిమిత్తం నగరంలోకి వచ్చిన వారంతా అవస్థలు పడ్డారు. రోడ్డు పక్క చిల్లర వ్యాపారాలు చేసుకునే వారంతా జోరు వర్షంలో తడిసిముద్దయ్యారు.